

5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నిడదవోలు


నిడదవోలు కోర్ట్ ప్రాంగణంలో జులై 5న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని మండల లీగల్ సర్వీసెస్ కమిటి ఛైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఖ్వాజా రెహ్మాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవధికార సంస్థ ఆదేశాలతో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బాకి, మనోవర్తి కేసులు, చిట్ ఫండ్, ఎక్సైజ్, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్, ఇతర మొండి బాకీ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ అంతిమ తీర్పు కాబట్టి అప్పీలు చేసుకునే అవకాశం లేదన్నారు. రాజీ చేసుకోవడం ద్వారా తమ విలువైన సమయాన్ని, ధనాన్ని అదా చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు ఈ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

కౌలు రైతుకు కష్టాలు

- ఆదుకోని సిసిఆర్ కార్డులు
- బీమా, మద్దతు ధర అన్నీ ఎండమావే

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాలకులు మారినా కౌలు రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లా రైతాంగం ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 1.48 లక్షల ఎకరాలకు గానూ 1.34 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. మిగిలిన 10 శాతం మరో 2, 3 రోజులలో నాట్లు పూర్తవుతాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఎరువుల ధరలు పెంపు, కొరత వంటి సమస్యలు వేధిస్తున్నాయి. మరో వైపు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం లభించని రైతులు ప్రయివేటు అప్పుల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రతి ఏటా జిల్లాలో రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలు అన్నీ కలిపి సుమారు 2 లక్షలకుపైగా ఎకరాల్లో సాగు జరుగుతోంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా ప్రతి ఏటా సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. సాధారణ రైతులతో పోల్చితే కౌలు రైతులకు ప్రత్యక్షంగా కౌలు భారంతో పాటు పరోక్షంగా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. బ్యాంకు రుణాలతో మొదలై, పంటలకు బీమా, దిగుబడులకు మద్దతు ధరా పూర్తిగా ఎండమావిలా మారుతున్నాయి. రైతులు, రైతు సంఘాల పోరాటాల ఫలితంగా పాలక ప్రభుత్వాలు ఎట్టకేలకు కౌలు రైతులకోసం సిసిఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్) కార్డులను అందజేశాయి. కానీ రైతుల సంక్షోభాన్ని ఈ కార్డులు ఏమాత్రం పరిష్కరించడం లేదు. ఈ కార్డులు అందించేందుకు భూయజమాని అనుమతి తప్పనిసరి చేయడమే ఈ దుస్థితికి కారణమని రైతు సంఘాలు చెబుతున్నాయి.



అత్యధిక సాగుదారులు కౌలు రైతులే...

జిల్లాలో 1.5 లక్షల మందికిపైగా కౌలు రైతులు ఉంటారని ఒక అంచనా. సాగు వ్యయంలో కౌలుతో సహా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత వెచ్చించినా ప్రకృతి విపత్తులతో పంట చేతికి రాని సందర్భాలు అధికంగా ఉంటున్నాయి. దీంతో భారీగా కౌలు రైతులు నష్టపోతున్నారు. సిసిఆర్ కార్డులు అందజేయడం ద్వారా కొంత ఊరట లభించే అవకాశాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రోత్సాహకం కనీసం 0.5 శాతానికి మించడంలేదు. ఫలితంగా పెట్టుబడి సాయం, పంట ఉత్పత్తులను అమ్ముకోవడం, నష్ట పరిహారం లేదా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంటల రుణం ఇలా ఏది వర్తించాలన్నా సిసిఆర్ కార్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అధికారులు సకాలంలో స్పందించి కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులు అందజేయాలని కౌలు రైతు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కౌలు రైతులకు సాయం కరువు

జిల్లా వ్యాప్తంగా 1,02,849 మంది కార్డులు మంజూరు చేయగా కేవలం 4136 మంది రైతులకు రూ.13.27 కోట్లు మంజూరు చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అత్యధిక మంది రైతులు ప్రయివేట్ వడ్డీ వ్యాపారులను అప్పుల కోసం ఆశ్రయిస్తున్నారు. మరోవైపు కౌలు ఒక్కో మండలంలో ఒక్కోరకంగా ఉంది. నీటి సౌకర్యం బాగా ఉంటే ఎకరాకు వేలకు వేలు కౌలు కట్టాలి. లేదా పంటలో మూడో వంతు చెల్లించాల్సి వస్తుంది. ప్రకృతి విపత్తులతో నష్టం వచ్చినా కౌలు చెల్లించక తప్పడం లేదు. మార్కెట్‌లో ధర లేకపోయినా నష్టపోవాల్సిందే. ఈ బాధలు పడలేక చాలామంది వ్యవసాయానికి దూరమవుతున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ ప్రోత్సాహకాలు

జిల్లాలో 1,02,849 మందికి సిసిఆర్‌సి కార్డులు అందజేశాము. క్షేత్రస్థాయిలో పర్యటించి 35725 మంది రైతులు బ్యాంకులలో రుణాల కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాము. సిసిఆర్ కార్డుల మంజూరులో భూయజమానులకు దశల వారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. భూ యజమానులకు అవగాహన కల్పించి కౌలు రైతులకు సహకరించాలని కోరుతున్నాము.

-ఎస్ .మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి

వేగంగా మున్సిపల్ స్టేడియం ఆధునీకీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని పోతుల వీరభద్రరావు మున్సిపల్ స్టేడియం ఆధునీకీకరణ పనులను వేగంగా పూర్తి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.7 కోట్లతో మున్సిపల్ స్టేడియం ఆధునీకీకరణ పనులకు రూరల్ నియోజకవర్గ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయానా నా తాత పోతుల వీరభద్రరావు పేరుతో ఎంఎల్ఎ బుచ్చయ్యచౌదరి స్టేడియంను ఆధునీకరించడం ఆనందంగా ఉందన్నారు. అనేక చారిత్రాత్మక ఘట్టాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని గుర్తు చేశారు. ఎందరో జాతీయ, అంతర్జాతీయ క్రీడా కారులు ఇదే స్టేడియంలో ఆడారని, ఎందరో రాజకీయ ప్రముఖులు ఇదే స్టేడియంలో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారని అన్నారు. గతంలో జిల్లాకు ప్రధాన కేంద్రంగా కాకినాడ ఉండేదని, దీంతో రాజమహేంద్రవరం నగరంలో సరైన స్టేడియం లేకుండా పోవడంతో క్రీడాకారులు అనేక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా క్రికెట్ స్టేడియం ఏర్పాటుచేసేందుకు 12 ఎకరాల స్థలం అవసరమని, ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నారన్నారు. పట్టణ ప్రాంతాల్లో అమృత్ పథకం, గ్రామీణ ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు నీరు అందించేందుకు ఏషియన్ బ్యాంక్ నిధులు మంజూరు చేస్తే గత ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిందని మంత్రి దుర్గేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ పథకాలను పట్టాలెక్కించి ప్రతి ఇంటికి నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లా డుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిం చేందుకు నగరపాలక సంస్థ కోట్ల రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు. పోతుల వీరభద్రరావు మల్టీ పర్పస్ మున్సిపల్ స్టేడియంను రూ.12 కోట్ల నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. 6 నెలల కాలంలో పనులు పూర్తిచేసి స్టేడియంను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంపిపి ప్రసాద్, కూటమి పార్టీల నాయకులు నార్ని వాసు, ఎం.శివప్రసాద్, మజ్జి పద్మ, నారాయణ గౌడ్, కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ నిర్వాహకుడు గాలి సుబ్బరాజు పాల్గొన్నారు.

పెరవలిలో మలేరియా నివారణా మాసోత్సవం

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో 'మలేరియా నివారణా మాసోత్సవం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పెరవలి భూపయ్య కాలవ గట్టు ప్రాంతంలో మలేరియా వ్యాధిపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రజలు ఈ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా శోకిన వ్యక్తికి చలి, వణుకు, వంటి నొప్పులతో జ్వరం రోజు మార్చి రోజు వస్తుందని వివరించారు. చెమటలు ఎక్కువగా పట్టి, జ్వరం తగ్గుతుందని లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కానూరు పిహెచ్‌సి పరిధిలోని నడిపల్లిలో డాక్టర్ పి.తేజశ్రీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ, హెల్త్ అసిస్టెంట్ యు.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్ష ఫలితాల విడుదల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పది, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్ష ఫలితాలు విడుదల అయినట్లు డిఇఒ కె.వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను apopenschool.ap.gov.in వైబ్‌సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 730 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 371 మంది ఉత్తీర్ణత పొందారని తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 460 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 246 మంది ఉత్తీర్ణత పొందారని తెలిపారు. పది, ఇంటర్మీడియట్ రీ-కౌంటింగ్‌కు ఎపి ఆన్‌లైన్ ద్వారా ఫీజు రూ.200, రీ వెరిఫికేషన్ కోసం రూ.1000 చెల్లించాల్సివుంటుందన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఎపి ఆన్‌లన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చునని, మరిన్ని వివరాలకు సంభందిత ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలని ఆయన సూచించారు.

జిల్లాలో 7.5 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - కొవ్వూరు

జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 7.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా గణాంక శాఖ అధికారులు వెల్లడించారు. గరిష్టంగా చాగల్లులో 36.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రాజమహేంద్రవరం రూరల్‌లో 34.5, అర్బన్‌లో 25.0, నిడదవోలులో 23.8, కొవ్వూరు, గోపాలపురం, దేవరపల్లి, కడియం మండలాల్లో చెదురుముదురుగా వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో వర్షం జాడ కనిపించలేదు. గురువారం సాయంత్రం మళ్లీ జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఓ మోస్తారు కురిసింది. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నీటి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో నీటి నిర్వహణలో నగర పాలక సంస్థ అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తుందని కేంద్ర బృందం సభ్యులు సుమన్, లక్ష్మీనారాయణలు కితాబు ఇచ్చారు. గురువారం జాతీయ జల పురస్కారం పథకంలో చేపడుతున్న పనులను కేంద్ర బృందం పరిశీలించింది. నగరంలోని వాటర్ ట్రీట్‌మంట్ ప్లాంట్, సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, కంబాల చెరువు, ఇంకుడు గుంతలను నీటి నిర్వహణను క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో నీటి నిర్వహణ పనులను 6వ జాతీయ జల పురస్కారానికి ఎంపిక చేయడానికి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జల కాలుష్య నివారణ, నీటిని పొదుపు చేయడం, పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం తదితర అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. భూగర్భ జలాల పెంపు కోసం నగరపాలక సంస్థ చేపడుతున్న పనులను కేంద్ర బృందం అభినందించింది. పూర్తిస్థాయిలో పరిశీలన అనంతరం నివేదికను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో ఎఇలు వెంకటేష్, శ్రీధర్, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరులో ఇసుక డ్రెడ్జింగ్ బోట్ సీజ్

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణ శివారులో ఉన్న దండగుండ-2 ఇసుక ర్యాంపులో బుధవారం అర్ధరాత్రి గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్న పడవను స్వాధీనం చేసుకున్నట్లు మైన్స్ ఎడి డి.ఫణి భూషణ్‌రెడ్డి తెలిపారు. సాధారణ తనిఖీలో భాగంగా డీ-సిల్టేషన్ ఇసుక రీచ్‌లను తనిఖీ చేస్తుండగా దొండగుంట-2 డీ-సిల్టేషన్ ఇసుక ర్యాంపులో ఇసుకతో కూడిన ఒక డ్రెడ్జింగ్ బోట్ నుంచి పోక్లెయిన్ సహాయంతో ఇసుకను దించుతుండగా పట్టుకున్నామన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు డ్రెడ్జింగ్ బోట్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం ఇరిగేషన్ శాఖ అధికారులకు అప్పగించామన్నారు. జిల్లా పరిధిలో నిబంధనలకి విరుద్ధంగా అక్రమ ఇసుక కార్యకలాపాల్లో ఇప్పటివరకు పాల్గొన్న 10 డ్రెడ్జింగ్ బొట్లను అధికారులు సీజ్ చేసినట్లు తెలిపారు. అంతేగాక గోదావరి నది మీదుగా నిర్మించిన బ్రిడ్జల వద్ద నుంచి 500 మీటర్ల పరిధిలో తవ్వకాలు చేపట్టిన 24 బొట్లను అధికారులు సీజ్ చేసి, అక్రమ ఇసుక కార్యకలాపాలను అరికట్టే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ, రాజమహేంద్రవరం, స్థానిక రెవెన్యూ , ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దండగుండ-2 ఇసుక ర్యాంపులో డ్రెడ్జింగ్ బోట్ వద్ద అధికారులు

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, కడియం



కడియంలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి

రాజమహేంద్రవరం నగరంలోని చున్నీలాల్ జాజూ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్.సీతామహాలక్ష్మి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన 'స్టూడెంట్ కిట్స్'ను విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ మహమ్మద్ హుమేరా భాను, 5వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ బి.గిరిజ, ఇతర కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే కడియంలో జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన విద్యామిత్ర కిట్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మిడ్డే మీల్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంఇఒ వై.నాగేశ్వరావు, ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, ఎస్ఎంసి ఛైర్మన్ గారపాటి సత్య, స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యోగాంధ్ర మాక్ డ్రిల్‌కు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



యోగాంధ్రా మాక్ డ్రిల్‌కు ప్రజలను సన్నద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజల్ని భాగస్వామ్యం చేయాలన్నారు. ఇప్పటికే వివిధ రంగాల వారితో యోగా సాధన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని 7 వేల ప్రాంతాల్లో 7.80 లక్షల మందితో జూన్ 21న యోగా సాధన చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు యోగాంధ్ర నమోదు విషయంలో రానున్న 2 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నన్నయ్య యూనివర్సిటీ, గేట్, మెడికల్ కాలేజీ, ఇతర విద్యాలయాలు ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా సాధన కార్యక్రమం నిర్వహించాలని, ఆమేరకు చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం సాయంత్రం 6 గంటలకి 6.40 లక్షల మంది జిల్లాలో నమోదు చేసుకున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. పాఠశాలలు ప్రారంభించిన నేపథ్యంలో 5వ తరగతిపైన విద్యార్థుల వివరాలను యోగాంధ్రాలో నమోదు చేయాలని అన్నారు. జిల్లా స్థాయిలో ఎన్రోల్మెంట్ కోసం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - గోకవరం, సీతానగరం

మండలంలోని కృష్ణుని పాలెం గ్రామంలో అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అల్లాడ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.త్రిలక్ష్మి, పి.అప్పాయమ్మ, ఎన్.దీనారత్నం, సిహెచ్.విజయలక్ష్మి, ఎస్.కొండా రత్నం, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు. సీతానగరం మండలం చినకొండెపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పెదలక్ష్మి పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సుభాషిణి, జె.ఎలిజబెత్, వి.సునీత, ఎ.మంగాకుమారి, వి.శాంతకుమారి, కె.సీత, కె.ధనలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గోకవరంలో జరుగుతున్న అక్షరాభ్యాసం

రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జువ్వల రాంబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలు నేరుగా రైతు బజార్లో అమ్ముకునేందుకు వీలుగా, పురపాలక సంఘం నిధులతో రైతు బజార్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రస్తుత సంత మార్కెట్ వద్ద రైతు బజార్ నిర్మించారని, కాలక్రమంలో తొలగించారని అన్నారు. పట్టణంలో ధరలపై నియంత్రణ లేకుండా పోయిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ఏ దుకాణదారుడు ప్రదర్శించడం లేదని విమర్శంచారు. రైతు పండించే కూరగాయలు, ఆకుకూరలు రైతు బజార్‌లో విక్రయించుకునేందుకు వీలుగా రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - నిడదవోలు, ఉండ్రాజవరం

పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందనివిద్యుత్ శాఖ అధికారి ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి నిడదవోలు టౌన్ 2 విద్యుత్ ఫీడర్ మరమ్మతులు, ట్రీ కటింగ్ నిమిత్తం ఎర్నగూడెం రోడ్, శాంతినగర్, వైఎస్ఆర్ కాలనీ, జగనన్న కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే ఉండ్రాజవరం మండలంలోని వేలివెన్ను సబ్ స్టేషన్ పరిధిలో 11 కె.వి, కాల్దారి ఇండస్ట్రియల్ ఫీడర్, 11 కె.వి పసలపూడి అగ్రికల్చర్ ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూనియన్ బ్యాంకులో సెల్ఫ్ పాస్ బుక్ ప్రింటర్

ప్రజాశక్తి - తాళ్లపూడి


స్థానిక యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో వినియోగదారుల సౌకర్యార్థం పాస్ బుక్ ప్రింటర్‌ను గురువారం బ్రాంచ్ మేనేజర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రింటర్ వలన సిబ్బందితో సంబంధం లేకుండా ఖాతాదారులే వ్యక్తిగతంగా తమ పాసుబుక్కులో తమ ఖాతాలకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవచ్చని అన్నారు. ప్రతి ఖాతాదారునికి కొత్త పాస్ బుక్‌లు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కిరణ్‌కమార్, చంద్రలేఖ, నటరాజ్, కన్నయ్య, ప్రశాంతి, గంగాధర్, మహేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో పలు అభివృద్ధి పనులను పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ గురువారం ప్రారంభించారు. 4వ వార్డులోని పార్కు ప్రహరీ గోడ, 27వ వార్డులో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ వజీరుద్దీన్, మునిసిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, కౌన్సిలర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఫ్యాక్టరీని తెరిపించాలని రిలే దీక్ష

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సగ్గొండలోని మూసి వేసిన భాగ్య నగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీని తెరిపించాలని, తొలగించిన కార్మిక నాయకులను విధుల్లోకి తీసుకోవాలని భాగ్యనగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం రిలే నిరాహార దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని, కార్మిక , సమస్యలను పరిష్కరించాలన్నారు. యూనియన్ ఏర్పాటు చేసుకున్నప్పటి నుంచి యాజమాన్యం వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. అందులో భాగంగా గత నెల 28న ఇద్దరు యూనియన్ నాయకులను యాజమాన్యం తొలగించిందన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఫ్యాక్టరీని మూసేశారన్నారు. గత 30న లేబర్ అధికారులు సమక్ష్యంలో ఫ్యాక్టరీని తెరుస్తామని, తొలగించిన వారిని తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందన్నారు. కాని నేటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో రిలే దీక్షకు దిగాహన్నారు. ఈ దీక్షకు సర్పంచ్ యండపల్లి శేఖర్ బాబు, గ్రామనాయకులు వెంకటరత్నం, హైకోర్ట్ న్యాయవాది నంభూరి శ్రీమన్నారాయణ మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రి, స్థానిక మంత్రి, ఎంఎల్ఎ స్పందించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, యూనియన్ అధ్యక్షులు పెందుర్తి వెంకటరాయుడు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మహర్షి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతు ఇస్తున్న న్యాయవాది శ్రీమన్నారాయణ



రికార్డులను పరిశీలిస్తున్న డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మ

పిహెచ్‌సిని సందర్శించిన డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి - కడియం

స్థానిక పిహెచ్‌సిని డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ సేవలు, ఆయుష్మాన్ భారత్ సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అధికంగా ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందించు సేవలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాధురి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ఆమె బంధువుపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొడవటి పోసమ్మ గత నెల 31న తన ఇంటి సమీపంలోని చర్చిని శుభ్రం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బరకటి నాగేశ్వరరావు తన సెల్‌ఫోన్‌లో ఆమెను వీడియో తీశాడు. ఈ విషయమై వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వివాదాన్ని ఆపడానికి పోసమ్మ మేనకోడలు అక్కడికి రాగా, నాగేశ్వరరావు ఆమెపై దాడి చేశాడు. ఆమె దుస్తులను చించేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

1,268 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రాజానగరం

స్థానిక జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 1,268 కేజీల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు స్వాధీనం గురువారం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో అధికారులు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే తణుకు నుంచి జగ్గంపేటకు బొలెరో వాహనంలో పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బియ్యాన్ని సీజ్ చేశారు. వీటి విలువ రూ.58,328 ఉంటుందన్నారు. ఎంఎస్ఒ జి.బాపిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోకవరం

పురుగు మందు తాగి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం...మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన సన్నపు నాగేంద్రుడు(50) తన ఇంటి వద్దే గురువారం పురుగుల మందును తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబీకులు గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలీని మృతదేహం

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో భక్తాంజనేయ స్వామి స్నాన ఘట్టం సమీపంలో గోదావరి నదిలో గురువారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుని వయస్సు సుమారు 45 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని, మృతుని వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదని పట్టణ సిఐ పి.విశ్వరం తెలిపారు. వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో లేదా 9440796622 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని సుభద్రపాలెం గ్రామానికి చెందిన తిప్పనబోయిన శ్రీనివాసరావు(35) విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. గురువారం ఉదయం అదే గ్రామంలోని ఒక రైతు పొలంలో పామాయిల్ గెలలు కోసేందుకు కూలికి వెళ్లిన శ్రీనివాసరావు విద్యుత్ వైర్లకు కత్తి తగలంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లజర్ల పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - రౌతులపూడి

రాజవరంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా, జూదం నిర్వహణ, వివాదాలు వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి, ఎంపిటిసి ఈగల నాని, ఉపేంద్ర ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

యువత క్రీడల్లో రాణించాలని కోరాడ సుబ్బారావు అన్నారు. కోరాడ శ్రీనివాస్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సుబ్బారావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తన కుమారుడికి క్రికెట్ అంటే అభిమానమన్నారు. తన కుమారుడు జనవరి నెలలో మరణించగా, అతడి మిత్రులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్లో 34 టీంలు పాల్గొనడం జరుగుతుందని సుబ్బారావు తెలిపారు.

సత్య దేవునికి వెండి ఆభరణం అందజేత

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామికి వెండితో చేసిన మకర తోరణం ఆభరణాన్ని దేవస్థానం వ్రత పురోహితులు గురువారం విరాళంగా ఇచ్చారు. సూపర్‌వైజర్లు నాగబట్ల రవి బ్యాచ్‌కు సంబంధించిన 43 మంది పురోహితులు కలిసి 2.345 కేజీల వెండితో సుమారు రూ.మూడు లక్షల విలువైన ఆభరణాన్ని దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావుకు అందజేశారు. అల్లరి శ్రీనివాస్, గుత్తిన రామకృష్ణ పాల్గొన్నారు

క్వారీ తవ్వకాలపై గ్రామసభ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాలలో సర్వే నెంబర్ 15లో నల్ల రాతి క్వారీ తవ్వకాలకు నిర్వహణకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విషయమై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆర్‌డిఒ శ్రీరమణి హాజరై స్థానికుల నుంచి అభిప్రాయాలు సేకరించారు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పన, పర్యావరణ సమస్యలు నివారణ, అధిక బరువుతో భారీ వాహనాల రవాణా పాఠశాల వేళల్లో వాహనాలు నిలుపుదలపై పలువురు సూచించారు.

రహదారుల అభివృద్ధితో రాష్ట్రాభివృద్ధి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

రహదారుల అభివృద్ధితో రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం మండలంలోని చివటం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ప్రజలకు అందజేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో రహదారులన్నీ చెరువులను తలపించేలా మారిపోయాయని విమర్శించారు. భారీ గుంతలు పడి ప్రజలను ప్రమాదాల బారిన పడవేసేవని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతి కాలంలోనే రహదారులను మెరుగుపర్చినట్లు తెలిపారు. చివటం గ్రామ సరిహద్దు, జాతీయ రహదారి నుంచి పాలంగి రోడ్డు వరకూ సుమారు రూ.1.20 కోట్ల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో సిసి రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తియిన సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏడాది పాలనపై టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - నిడదవోలు, గోకవరం, కొవ్వూరు



కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పూర్తియిన సందర్భంగా కూటమి నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. నిడదవోలు పట్టణంలో గణేష్ చౌక్ వద్ద జరిగినకార్యక్రమంలో పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. కేక్ కటింగ్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను కూటమి నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.అలాగే గోకవరం గ్రామంలోని టిడిపి కార్యాలయం వద్ద గ్రామ అధ్యక్షులు పైలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మంగరౌతు రామకృష్ణ, దాసరి తమ్మన్నదొర, పాలూరు బోసుబాబు, సత్తి వెంకటరెడ్డి, బత్తుల సత్తిబాబు, గునిపే భరత్, గవిని దుర్గాప్రసాద్, పులపర్తి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు పట్టణ టిడిపి కార్యాలయంలో టిడిపి శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ దిసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయుడు చౌదరి, కంటమని రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు బివి.ముత్యాలరావు, పాల్గొన్నారు.

పంటల పెంపకంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - తాళ్లపూడి


రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

వివిధ రకాల పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. మండలంలోని మలకపల్లిలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం, వేమగిరి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొని పంటల పెంపకంపై పలు సూచనలు చేశారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.సరళ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల వినియోగం, సాంకేతిక అవగాహన, మట్టిలో ఉన్న పోషక తవ్వకాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ శిరీష ఎరువుల వినియోగం, పూల సాగుపైన అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ రఘునందన్ అరటి, వరి, కంద సాగు రక్షణ చర్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రుచిత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి- కాకినాడ

2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తోందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో నిధులను విడుదల చేసి పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. గురువారం కాకినాడలో దేవాలయం వీధిలో ఉన్న శ్రీనివాస కల్యాణం మండపంలో వృత్తి నిపుణుల సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు అవుతోందని, ఈ కాలంలో చేసిన కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని, ఇంకా రోడ్లు, జాతీయ రహదారి వంటివి నిర్మించామని చెప్పారు. రాష్ట్రాభివద్ధికి కేంద్రం రూ.లక్షల కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ఎనిమిరెడ్డి మాలకొండయ్య, తుమ్మల పద్మజ, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, వేటుకూరి సూర్యానారాయణ రాజు, రావూరి సుధా, పైడా కృష్ణమోహన్, వెంగమాంబ శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, డివి.సూర్యానారాయణ రాజు, వి.ఉమామహేశ్వరి, పైడా భవన ప్రసాద్, సింగిలిదేవి సత్తిరాజు, యార్లగడ్డ రామ్ కుమార్, కె.భీమశేఖర్, కుండల సాయికుమార్, చక్కా రమేష్, దిలీప్ కుమార్ సదనాని, గౌతు చిన్నా తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కమిషన్ ఛైర్మన్ జవహర్

సుబ్రహ్మణ్యం హత్య కేసు పునర్విచారణ చేయిస్తాం

ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్ జవహర్

ప్రజాశక్తి -పెదపూడి

గత వైసిపి ప్రభుత్వంలో ఎంఎల్‌సి అనంత బాబు డ్రైవర్ విజి.సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన సంఘటనపై పునర్విచారణ చేయిస్తామని ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని గొల్లలమామిడాడలో సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా ఉన్న వ్యక్తి హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. కుటుంబ సభ్యుడిని కోల్పోయిన వారి పరిస్థితి, వారి జీవనోపాధి గురించి వాకబు చేశారు. వాళ్లకు ఇల్లు లేకపోవడం, కేటాయించిన స్థలంలో నిర్మాణ విషయంలో ఇబ్బందులు ఎదురవటం గురించి తహశీల్దారు, ఎంఎల్ఎ రామకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యను సత్వరం పరిష్కరించాలని, సుబ్రహ్మణ్యం తల్లికి ఉపాధి కల్పించాలని ఆదేశించారు. సుబ్రహ్మణ్యం హత్య కేసు పునర్విచారణ, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలపై ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. లీగల్ టీమ్‌ను కూడా ప్రత్యేకంగా నియమించిందన్నారు.


కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న సిపిఎం , ప్రజాసంఘాల నాయకులు

విమాన ప్రమాద మృతులకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి - నిడదవోలు

అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు సిపిఎం నివాళులర్పించింది. గురువారం పట్టణంలో గణపతి సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జువ్వల రాంబాబు, ప్రజాసంఘాల కార్యకర్తలు గంటి కృష్ణ, జి.డానియల్, ఉస్మాన్ మజీద్, సత్యనారాయణ, ప్రభాకర్, సురేష్, నాని తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న రవీంద్రనాథ్

తుది పోరులో దేవరపల్లి జట్టు విజయం

ప్రజాశక్తి - దేవరపల్లి

స్థానిక ఎఎస్ఎన్ఆర్ జడ్‌పి హైస్కూల్లో నిట్టా మోహిత్ నాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవరపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి 54 టీములు పాల్గొన్నాయి. గురువారం జరిగిన తుది మ్యాచ్‌లో దేవరపల్లి మోహిత్ లెవెన్, భీమడోలు నిట్టా లెవెన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్లో దేవరపల్లి జట్టు విన్నర్‌గా నిలిచింది. విజేతకు ట్రోఫీతోపాటు, రూ.55,555 నగదు, రన్నర్ జట్టుకు ట్రోఫీతోపాటు, రూ.33,333 నగదును షాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, రామకృష్ణ, దేవరపల్లి కార్యదర్శి నిట్టా రవికిషోర్, కంబాల సత్తిబాబు పాల్గొన్నారు.

అంబేద్కర్ మోడల్ స్కూల్లోనే చదువుతాం

ప్రజాశక్తి - నిడదవోలు


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

డాక్టర్ అంబేద్కర్ ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలోనే తాము చదువుతామంటూ బాల, బాలికలు గురువారం పాఠశాల వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జువ్వల రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో స్కూల్స్ విలీనం పేరుతో లూథరన్ ఎలిమెంటరీ స్కూల్‌ను మున్సిపాలిటీలో విలీనం చేసిందన్నారు. అయితే పూర్వ విద్యార్థులు పోరాటం ఫలితంగా అంబేద్కర్ ఎలిమెంటరీ స్కూల్‌గా మారిందన్నారు. ఈ సందర్భంగా బాల, బాలికలతో ఇదే పాఠశాలలో తామంతా చదువుతామని ప్రతిజ్ఞ చేయించారు.

మౌలిక సౌకర్యాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కాజులూరు


తాగునీరు పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం మండలంలోని దుగ్గుదుర్రు శివారు పాలమూరుపాడు దళితవాడలో దశాబ్దన్నర కాలంగా తాగునీటికి నోచుకోకపోవడంతో మంత్రి సుభాష్ చొరవతో నిధులు వెచ్చించి గురువారం సరఫరా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సౌకర్యాల కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, గతంలో పని చేసిన మంత్రులు తాగునీటి పంపిణీకి ఆసక్తి చూపకపోవడం గమనార్హం అన్నారు. గ్రామంలో సుమారు 30 మీటర్లు రోడ్డు నిర్మాణానికి, లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాలకు నీరు వెళ్లకుండా అడ్డగిస్తున్న ఒక రైతుపై చర్యలు తీసుకోవాలని రైతులందరూ ఆర్‌డిఒకు వినతిపత్రం అందించడం ద్వారా సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిడిఒ జె.రాంబాబు, సర్పంచి పోతు వెంకటలక్ష్మి జ్యోతి కుమార్, సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షులు లఖాని కృష్ణ చైతన్య, దాట్ల విజయ గోపాల రాజు, నామవానిపాలెం సర్పంచ్ భూపతిరాజు చిట్టి రాజు, టిడిపి మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి పాల్గొన్నారు.

అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - సామర్లకోట


ఎన్నికైన దుప్పట్ల వర్తక సంఘం నూతన కార్యవర్గం

ప్రభుత్వాసుపత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని శ్రీ శివశంకర దుప్పట్ల వర్తక సంఘం అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో సంఘం 41వ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం అల్ట్రాసౌండ్ సౌకర్యం అవసరమని తెలిపారు. ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిఐటియు మండలాధ్యక్షుడు బాలం శ్రీనివాస్ పాల్గొన్నారు. నూతన అధ్యక్షునిగా కరణం శ్రీనివాసరావు, కార్యదర్శిగా కరణం సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా కత్తిరి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గుడ్ల నారాయణరావు, కోశాధికారిగా పోతుల శ్రీనివాస్, సభ్యులుగా పెంకే వెంకట రాజేష్, కరణం గోవిందరాజు ఎన్నికయ్యారు. ఈ సభలో తుటిపాటి రాజు, తలరాపు నర్సారావు, సప్ప సత్తిబాబు, పిఎస్.నాయుడు, బాలం సత్తిబాబు, ఇదిబిల్లి ప్రసాద్, పారినాయుడు శ్రీను పాల్గొన్నారు.

పని గంటల పెంపునకు నిరసనగా ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

పని గంటల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని నిరసిస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ కార్మికవర్గం ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచడాన్ని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లుగా మార్చడానికి ప్రయత్నిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ, నీలపాల సూరిబాబు, తాడిశెట్టి గంగ, వడ్డి సత్యనారాయణ, లోవ కుమారి, సీతామహాలక్ష్మి, కె.మహాక్ష్మి, వేణి పాల్గొన్నారు.


అన్ అకాడమీ కాలేజీ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా

నిబంధనలు పాటించని ప్రయివేటు విద్యా సంస్థలు

ప్రజాశక్తి-కాకినాడ

నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణ జూనియర్ కళాశాల, అన్ అకాడమీ విద్యా సంస్థల వద్ద గురువారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాతో స్పందించిన ఇంటర్మీడియట్ జిల్లా అధికారి డివైఇఒ శారద నారాయణ జూనియర్ కళాశాలకు వచ్చి పుస్తకాలను సీజ్ చేశారు. ఈ కళాశాలకు ప్రభుత్వ అనుమతి లేదని, అనుమతులు వచ్చేవరకూ కళాశాల నిర్వహించవద్దని ఆదేశించారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగాసూరిబాబు మాట్లాడారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిద్దు, మణికంఠ, సాహిత్, అరుణ కుమార్, లోవరాజు, నాని, చిన్ని, గమినివేలు, అనిల్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **MEESALA GOUTHAM KIRAN,** S/o. Appa Rao, D.No. 18-5-18/7, 2nd Street, Lingampeta, Rajahmundry, E.G. Distrct, A.P., Pin: 533101, I have changed my name from **MEESALA GOWTHAM KIRAN** (Old Name) to **MEESALA GOUTHAM KIRAN** (New Name). Hence forth Iam being called **MEESALA GOUTHAM KIRAN,** S/o. Appa Rao, for all purpose.

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట పట్టణం, ధర్మగుండం చెరువు వీధి కాపురస్తులు చిట్టూరి సుబ్బారావు గారి కుమారుడు చిట్టూరి నాగ్ ప్రసాద్, డోర్ నెంబర్: 24-1-18 యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **U5265965,** తేదీ 24-02-2020 కలది. 05-06-2025వ తేదీన మా ఇంటి నుండి కలువ పువ్వు సెంటర్లో గల జిరాక్స్ షాపునకు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

చిట్టూరి నాగ్ ప్రసాద్
S/o. సుబ్బారావు, డోర్ నెంబర్ : 24-1-18
ధర్మగుండం చెరువు వీధి, మండపేట - 533308
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ నెంబర్ - 8106430535

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట పట్టణం, ధర్మగుండం చెరువు వీధి కాపురస్తులు చిట్టూరి ప్రియాంక, భర్త: నాగ్ ప్రసాద్, డోర్ నెంబర్: 24-1-18 యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **U5265532,** తేదీ. 24-02-2020 కలది. 05-06-2025వ తేదీన మా ఇంటి నుండి కలువ పువ్వు సెంటర్లో గల జిరాక్స్ షాపునకు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది, ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

చిట్టూరి ప్రియాంక
W/o. నాగ్ ప్రసాద్, డోర్ నెంబర్ : 24-1-18
ధర్మగుండం చెరువు వీధి, మండపేట - 533308
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ నెంబర్ - 8050597464

CHANGE OF NAME

I, YALAMARTHI RAMESH (New Name), S/o. Yalamarthi Apparao, Resident of D.No.1-95/1, MLA Gari Street, Velivennu, Undrajavaram Mandal, E.G.Dist., Andhrapradesh. Have changed my name from **YALAMARTI RAMESH (Old Name)** To **YALAMARTHI RAMESH (New Name).** Hence after all my Documents and Correspondance will be continuing with my name as **YALAMARTHI RAMESH (New Name)** for all practical purposes.

PUBLIC NOTICE

(Correction of Candidate's Name and Parent Detials in ICSE Class X Records)

Public Notice is hereby issued on behalf of **Ms. Kasireddi Charishma Bhavya Sri,** daughter of **Sri Kasireddi Raju and Smt. Kasireddi Satyaveni,** a student of **St.Joseph's Convent School, Kakinada (Centre No: 1255186),** bearing **Index No. 1255186/069** and **Unique ID.8606978,** who appeared for the **ICSE Class X Examination - 2024,** conducted by the **Council for the Indian School Certificate Examinations (CISCE), New Delhi.**

It has come to light that the following entries in her **Pass Certificate cum Statement of Marks are erroneous:**

1. **Candidate's Name:** Recorded as **"Kasireddy Charishma Bhavya Sri"**
2. **Mother's Name:** Recorded as **"K. Satyaveni"**
3. **Father's Name:** Recorded as **"Kasiredy Raju"**

As per the **Birth Certificate** and supporting documentation, the **correct entries** should be:

***Candidate's Name : Kasireddi Charishma Bhavya Sri**
***Mother's Name : Kasireddi Satyaveni**
***Father's Name : Kasireddi Raju**

All Stakeholders - including the **CISCE,** the school authorities, and any other concerned parties - are requested to update all relevent records accordingly.

Furthermore, the Candidate and her parents irrevocably indemnify and discharge the CISCE and St.Joseph's Convent School, Kakinada, including their officials and representatives, from any legal or financial liability that may arise from implementing these corrections.

Any Individual or Organization with a claim, objection, or concern regarding the proposed amendments must notify the undersigned **in writing within seven (7) days** from the publication of this Notice. Failing which, it will be presumed that there is no objection, and the required rectifications shall be processed without further intimation.

KARRA VENU, ADVOCATE
Kakinada. #6-3-30, Dantuvari Street,
Dt:11-6-2025 Kakinada. Cell: 9849548272

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT: ONGOLE
A.R.C. No.69 /2024

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd, Markapurm Branch, Rep. By it's Asst Divisional Manager,
...Disputant

AND

Poleboyina Bhupaludu **& Others**
...Opponents

Notice to Opponents 1 to 4

1.Poleboyina Bhupaludu,S/o Rangaiah, Aged About: 44 Years, Occ:-Asst Sub- Inspector(R)195, 16TH, Battalion, APSP94144153, A'Gmpony, Vishakapatnam, R/o:-D.NO:4-8-272, Sakeethapuram, Koritepadu, Guntur (Dist). **(Opponent-1)**

2. Avula Chennaiah,S/o Pedda Bala Rangaiah,Aged about:55 years, Occ:-16TH Battalion, APSP, A.P.S.I, Vishakapatnam (dist). R/o:D.NO: 15-1-982,2nd Line, Nehuru Nagar, RTC Colony, Macherla (md) Guntur (Dist). **(Opponent-2)**

3.Dampetla Chandra Sekhar, S/o.Naganna Aged about:43 Years,Occ:16TH Battalion,APSP, HeadConstable, Vishakapatnam (dist) R/0:D.NO:35/3,11thAPSP, Bakarapet, Peddapalle, Madhavaram (vill), Siddavaram(md), Cuddapah (Dist),AP, 516247. **(Opponent-3)**

4.Bomburi Ganapathi S/0 Guruvulu Aged About 47 Years Occ:16TH Battalion, APSP, A.P.S.I, Vishakapatnam (dist).R/0:D.NO: 4-218/10,Sri Lakshmi Narasimha Nagar,Rajahmundry Rural (md), Dowlaiswaram, Vemagiri, East Godavari,(Dist) **(Opponent-4)**

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Registrar Chits ordered notice to all of you and posted the case to 24-06-2025 for your appearance. So all of you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Ongole on 24-06-2025 at 10-30 A.M. in person , failing which the matter will be decided in your absence.

(By order of the Honorable Deputy Registrar)

Hearing Date: 24-06-2025

M/S KAPIL CHITS KOSTA PVT LTD,
Rep. Asst Divisional Manager.